ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

ఆదివారం 18 ఫిబ్రవరి 2024





హరితహారం లక్ష్యం ఖరారు

- 7.58 లక్షల మొక్కలు
- అత్యధికంగా డీఆర్డీవోకు ఐదు లక్షలు
- జిల్లాలో 255 నర్సరీల్లో 25.79 లక్షలు మొక్కల పెంపకానికి చర్యలు
- ఇప్పటికే 15 లక్షల మొక్కలు సిద్ధం
- గతేడాది ఉపాధిహామీలో నాటిన మొక్కలు 6.92 లక్షలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

హరితహారం యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల ఆధ్వర్యంలో అన్ని శాఖలను భాగస్వాములను చేస్తూ వర్షాలు కురవడంతోనే మొక్కలు నాటడానికి ప్రణాళికా బద్ధంగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో 19 శాఖల ద్వారా 7.58 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణను హరితవనంగా మార్చేందుకు ఏటా మొక్క లు నాటే కార్యక్రమాన్ని మొక్కవోని దీక్షగా చేపడుతున్నారు. 9వ విడత హరితహారంలో మొక్కలు 15.08 లక్షల మొక్కలు నాటే విధంగా లక్ష్యంగా పెట్టుకొని పూర్తి చేశారు. పదో విడత హరితహారంలో జిల్లా వ్యాప్తంగా 7.58 లక్షల మొక్కలు నాటనున్నారు.

శాఖల వారీగా లక్ష్యాలు



హరిత లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లాలో ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించారు. ఈ సారి 7.58 లక్షల మొక్కలు నాటే లక్ష్యంలో అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 5 లక్షల మొక్కలు నాటనున్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో 50 వేలు, వేములవాడ మున్సిపాలిటీలో 20 వేలు, వ్యవసాయ శాఖ 20 వేలు, అటవీ శాఖ లక్ష, ఎక్సైజ్ శాఖ 20 వేలు, విద్యాశాఖ 6 వేలు, ఉద్యాన శాఖ 5 వేలు, రెవెన్యూ శాఖ వెయ్యి, ఆర్అండ్‌బీ శాఖ 10 వేలు, నీటి పారుదల శాఖ 10 వేలు, వైద్య ఆరోగ్య శాఖ 5 వేలు, పోలీస్ శాఖ 5 వేలు, మైనింగ్ శాఖ వెయ్యి, పౌరసరఫరాల శాఖ, పరిశ్రమల శాఖ, దేవాదాయ శాఖ, సెస్, మైనార్టీ వెల్ఫేర్ శాఖలు వెయ్యి చొప్పున మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నారు.

జిల్లాలో ఉపాధిహామీలో బతికిన మొక్కలు

మండలం	గ్రామాలు	ప్రస్తుత లక్ష్యం	గతేడాది బతికిన మొక్కలు
బోయినపల్లి	23	40,000	49,236
చందుర్తి	19	40,000	52,689
ఇల్లంతకుంట	33	50,000	92,562
గంభీరావుపేట	21	50,000	59600
కోనరావుపేట	28	50,000	70,587
ముస్తాబాద్	22	50,000	58,399
రుద్రంగి	10	10,000	22,960
తంగళ్లపల్లి	30	50,000	74,225
వీర్నపల్లి	17	50,000	52,027
వేములవాడ అర్బన్	11	20,000	26,584
వేములవాడ రూరల్	17	40,000	47,589
ఎల్లారెడ్డిపేట	24	50,000	61,522
మొత్తం	255	5,00,000	7,980

నర్సరీలో 25.79 లక్షల మొక్కల పెంపకానికి చర్యలు

జిల్లా వ్యాప్తంగా 255 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలు ఉన్నాయి. ప్రభుత్వ స్థలాల్లో 218 నర్సరీలు, ప్రైవేటు స్థలాల్లో 37 నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల్లో 25.79 లక్షల మొక్కలను పెంచే విధంగా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే 15.43 లక్షల మొక్కలు సిద్ధం ఉండగా జూన్ వరకు 25 లక్షల మొక్కలకు చేరుకోనుంది. నర్సరీలలో ఉన్న మొక్కలను ఆయా గ్రామాల్లోనే నాటనున్నారు. ఇళ్లలో నాటేందుకు పూలు, పండ్ల మొక్కలను అందించనున్నారు.

ఉపాధి హామీలోనే మొక్కల లక్ష్యం

హరితహారంలో మొక్కలు నాటడం సంరక్షణలో ఉపాధిహామీ కిందనే ఎక్కువగా లక్ష్యాన్ని పెట్టుకుంటున్నారు. డీఆర్‌డీఏ ద్వారా 2020-21లో 28,53,745 మొక్కలు నాటగా 27,29,701 మొక్కలు బతికున్నాయి. 2021- 2022లో ఉపాధిహామీ కింద 26,78,762 మొక్కలు నాటగా 25,51,234 మొక్కలు బతికి ఉన్నాయి. 2022 -23లో 19,17,248 మొక్కలు నాటగా 18,54,541 మొక్కలు బతికి ఉన్నాయి. 2023 - 24లో ఉపాధిహామీ కింద 6,92,099 మొక్కలు నాటారు. ఇందులో 6,67,980 మొక్కలు బతికి ఉన్నాయి. పల్లె ప్రకృతి వనాలతో కూడా పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు.

పెళ్లెప్పుడవుతుంది.. పిల్ల ఏడ దొరుకుతుంది..

- వధువుల కోసం యువకులు, తల్లిదండ్రుల వేట
- అన్ని రకాలుగా స్థిరపడ్డా కుదరని పెళ్లి సంబంధాలు
- గ్రామాల్లో, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి
- పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు

7లో



ఈ రోజుల్లో పెళ్లికి అబ్బాయిలకు అమ్మాయిలు దొరకడం గగనమైపోయింది. గతంలో 18 ఏళ్లు వయస్సు వచ్చేసరికి పిల్లలకు పెద్దలు వివాహాలు జరిపించేవారు. ప్రస్తుతం మారుతున్న కాలంలో ఉన్నత చదువులతోపాటు ఆర్థికంగా స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలని యువత భావిస్తుండడం ఒక కారణమైతే.. పురుషులు, స్త్రీల నిష్పత్తి ప్రకారం చూస్తే పెళ్లీడు అమ్మాయిలు తగినంత మంది లేకపోవడం మరోకారణం. దీంతో పెళ్లికాని ప్రసాద్‌ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : గర్భిణులు, బాలింతలు పౌష్టి కాహారాన్ని తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధి లోని రగుడు, చంద్రం పేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను శని వారం జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీ రాజం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో స్పాట్ ఫీడింగ్ పెంచడంతోపాటు హాజరు శాతాన్ని మెరుగుపర్చాడానికి రాగి లడ్డూ పంపిణీ కొనసాగుతున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలద్వారా పౌష్టిక ఆహారాన్ని అందిస్తోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సూర్యకళ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట కేంద్రంలో శనివారం మల్టీ మిల్లెట్ గ్రీన్ లడ్డూలను పంపిణీ చేశార

దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17: దొంగతనాల నివారణకు నిఘా పటిష్ఠం చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో 13 పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టడానికి పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, వారి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కృషి చేయాలని అన్నారు. జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల రవాణాపై దృష్టిసారించి నిఘా కఠినతరం చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి , నాగేంద్రచారి, మహేశ్‌బాబు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి జిల్లాలోనే పేరు తీసుకురావాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్తయ్యను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శనివారం ఘనంగా సన్మానించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, తిరుపతిబాబు, బాబు, మధు, నాయకులు పర్శరాములు, మజీద్, శ్రీనివాస్‌రెడ్డి, కాంతారావు, సుధాకర్‌రావు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

21న కవి సమ్మేళనం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17: ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సిరిసిల్ల మానేరు రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని సినారె జిల్లా గ్రంథాలయంలో బుధవారం ఉదయం10 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 20వ తేదీలోగా 9849157752 ఆడెపు లక్ష్మన్‌కు పంపించి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

వేములవాడ, ఫిబ్రవరి 17 : వేములవాడ పట్టణంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ కరస్పాండెంట్ శ్రీసన్నిధి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17: చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్ విజ్ఞానవర్ధిని ఉన్నతపాఠశాలలో న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా బడిలో ఉండాల్సిన పిల్లలను పనిలో పెట్టవద్దన్నారు. బాలబాలికలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువులో రాణించి భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. కోర్టులలో నిరుపేదలకు ఉచిత న్యాయం లభిస్తుందన్నారు. ఇందుకు న్యాయసేవాధికార సంస్థలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి కావేటి సృజన, ట్రాఫిక్ ఎస్సై రాజు, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, డీఎల్‌సీ ప్రతినిధులు పర్శరాములు, న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు స్పందన

- ఎస్పీ అఖిల్ మహాజన్



లర్నింగ్ లైసెన్స్ అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17: జిల్లాలోని గ్రామీణ యువతీ, యువకులకు డ్రైవింగ్ వచ్చి ఉండాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లాలోని రుద్రంగి మండల పరిధిలోని 50 మంది యువతీ, యువకులు లర్నింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి నిర్ణీత రుసుముతో లర్నింగ్‌లైసెన్స్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవవాహనం ఉన్నా చాలా మందికి రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడినప్పుడు వారికి వచ్చే బీమా వర్తించదన్నారు. దశలవారీగా గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు మేళా నిర్వహించి లైసెన్స్‌లు అందిస్తామన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, ఎంవీఐ కిషోర్‌చంద్రారెడ్డి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : సీనియర్ సిటిజన్‌లు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు.సీనియర్ సిటిజన్‌లకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. చేపూరి బుచ్చయ్య అధ్యతన నిర్వహించిన సమావేశంలో లక్ష్మీరాజం మాట్లాడారు. 60 ఏళ్లు దాటిన తర్వాత అనారోగ్యానికి గురవడం సహజమని, దాన్ని ఎదుర్కోవాలంటూ సీనియర్ సిటిజన్‌లు ప్రతీ ఒక్కరు వైద్యపరీక్షలను చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జనపాల శంకరయ్య, ఎనుగుల ఎల్లయ్య, దేంత దేవదాస్, గజ్జెల్లి రామచంద్రం, అంకారపు జ్ఞానోభా, ముత్తయ్యగౌడ్, భూమయ్య, విద్యాసాగర్, మిట్టపల్లి రాములు, చిటికెన కనకయ్య, తడుక శ్రీహరి, కొక్కుల రాజేశం, గౌరిశెట్టి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కోతకు గురైన మాటు కాలువ

- ఆరు నెలలుగా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతులు



తెగిపోయిన మాటు కాలువ(ఒర్రె)

రుద్రంగి, ఫిబ్రవరి 17: గతేడాది కురిసిన భారీ వర్షాలకు రుద్రంగి మండల కేంద్రం శివారులోని నాగారం చెరువుకు వెళ్లే మాటు కాలువ(ఒర్రె) భారీ వరదలకు చాలా చోట్లా కోతకు గురైంది. నాగారం చెరువు ప్రధాన కాలువకావడంతో మాటు కాలువకు గోరిలాల్యా ప్రాంతంలో రెండు చోట్ల కోతకు గురైంది. దీంతో గత వర్షాకాలంలో పొలాలు నీట మునిగాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లంపల్లి నీటిని విడుదల చేస్తే ఇదే మాటు కాలువ ద్వారా నాగారం చెరువులోకి గోదావరి జలాలు వెళ్తాయి. ప్రస్తుతం గోరిలాల్యా ప్రాంతంలో మాటు కాలువ(ఒర్రె) రెండు చోట్ల తెగిపోవడంతో నీరు నాగారం చెరువులోకి వెళ్లకుండా పొలాల్లోకి వెళ్లి మునిగిపోయే ప్రమాదం ఉంది. గోదావరి జలాలు చెరువులోకి వెళ్లకుండా వృథాగా పోతాయి. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కాలువలను పరిశీలించిన వారు లేరని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి

- పోగుల మహేష్, యువరైతు, రుద్రంగి



ఆరు నెలల క్రితం భారీ వర్షాల కారణంగా తెగిపోయిన మాటు కాలువ ఇప్పటి వరకు మరమ్మతుకు నోచుకోలేదు. కాలువ(ఒర్రె) తెగిపోవడంతో పొలాలు నీట మునిగిపోయాయి. ఎల్లంపల్లి నీరు నాగారం చెరువులోకి వదలక ముందె తెగిన మాటు కాలువకు మరమ్మతు చేయించాలి.

రాజన్న సేవలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు



ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ, ఫిబ్రవరి 17: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర టీఎన్జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, స్వామి వారి ప్రసాదం అందజేశారు. యూని యన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఆలయ ఉద్యోగుల సం ఘం అధ్యక్షుడు ఎస్.హరికిషన్, కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, గోలి శ్రీనివాస్, గుండి హరిహరనాథ్, రాజశేఖర్, అల్లి శంకర్, సంకెపెల్లి పవన్ పాల్గొన్నారు.


వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17: గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి యోజన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటల విధానం, దిగుబడి, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఏవో భూమిరెడ్డి, ఏఈవో ముకుందం, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, మాజీ సర్పంచ్ సరోజ, కళాశాల విద్యార్థులు మైత్రేయి, మనస్విని, శ్రీప్రియ, శ్రీషు, సుష్మబాయి, రైతులు నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మీ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ముస్తాబాద్, ఫిబ్రవరి 17: ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోత్గల్ రహదారిలో మానేరు కెనాల్ పక్క నుంచి పెద్దమ్మల కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కాళేశ్వరం అవినీతి లక్ష్యంగా పనిచేసిందని వివరించారు. మండల అధ్యక్షుడు ఎళ్ల బాల్‌రెడ్డి, జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, రాజిరెడ్డి, అగుళ్ల రాజేశం, గజ్జెల రాజు, గుండెల్లి శీను, దీటి నర్సింహులు, అన్నం శ్రీధర్‌బాబు, చెల్లపురం మహేందర్, ఎద్దండి మహేందర్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, శీలం ప్రశాంత్, భాను, విజయ్‌రెడ్డి, తిరుపతి, పెద్దిగారి శ్రీనివాస్, యాగళ్ల మల్లేశ్ పాల్గొన్నారు.









అత్తింటి ఎదుట తోడికోడళ్ల బైఠాయింపు


మానకొండూర్, ఫిబ్రవరి 17: మండలంలోని గంగిపల్లిలో ప్రేమించి, పెళ్లి చేసుకుని మోసం చేశాడని ఆరోపిస్తూ అత్తింటి ఎదుట శనివారం బైఠాయించారు. బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన గొడిశాల రమేశ్, గొడిశాల వెంకటేశ్ ఇద్దరు అన్నదమ్ములు. రమేశ్ అదే గ్రామానికి చెందిన చంద్రకళ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం తరువాత చంద్రకళ మరో చోట ఉంటోంది. ఈ నేపథ్యంలో రమేశ్ మరో యువతిని పెళ్లి చేసుకుని ఊర్లోనే కాపురం పెట్టాడారు. అతని తమ్ముడు గొడిశాల వెంకటేశ్ హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఆ సమయంలో హైదరాబాద్‌లో స్థిరపడిన కర్ణాటకకు చెందిన రాధికతో పరిచయం ఏర్పడింది. రాధికకు ముందే పెళ్లి అయి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా రాధికకు భర్త చనిపోయాడు. రాధికకు, వెంకటేశ్‌కు ఏర్పడిన పరిచయం పెళ్లికి దారి తీసింది. కొంత కాలం రాధికతో ఉన్న వెంకటేశ్ గంగిపల్లికి వచ్చి మరో యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. వెంకటేశ్ తన దగ్గరికి రాకపోవడంతో రాధిక అతడి విషయంపై ఆరా తీయగా మరో పెళ్లి చేసుకున్న విషయం తెలిసింది. దీంతో శనివారం ఆమె గ్రామానికి చేరుకుని తనకు న్యాయం చేయాలని వెంకటేశ్ ఇంటి ఎదుట బైఠాయించింది. విషయం తెలుసుకున్న రమేశ్ మొదటి భార్య చంద్రకళ సైతం రాధికతో పాటు బైఠాయించింది. చంద్రకళ ఇంటిముందు బైఠాయించిందన్న విషయం తెలుసుకున్న రమేశ్ ఆమెకు ఫోను చేయడంతో చంద్రకళ వెళ్లిపోయింది. ఇంటిముందు రాధిక ఒక్కతే ఉండడంతో వెంకటేశ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు వాపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సైశ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని వెంకటేశ్ కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి న్యాయం చేస్తామని చెప్పి రాధికను తీసుకెళ్లారు. రాధిక ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌తో పాటు అతడి అన్న, తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, ఫిబ్రవరి 17: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు మారుతీ టౌన్‌షిప్ వద్ద శనివారం కారు-బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్ షిప్ సమీపంలో జగిత్యాల వైపు నుంచి స్విఫ్ట్ కారుతో పాటు కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెందిన గరిగంటి శ్రీనివాస్(40) అనే వ్యక్తి ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ ఢీకొన్నాయి. దీంతో అతను కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాస్‌ను 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మృతి చెందాడు. శ్రీనివాస్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రహీం తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, ఫిబ్రవరి 17: మండలంలోని గంభీర్‌పూర్ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టుకున్నామని ఎస్సై నవీన్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు. వాగుల్లోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.











రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్థక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్ రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

యాదాద్రి ఆలయంలో బ్రేక్ దర్శనం అమలు తీరుపై పరిశీలన



యాదాద్రి ఆలయ అధికారులతో చర్చిస్తున్న సిబ్బంది

వేములవాడ, ఫిబ్రవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో వీఐపీ బ్రేక్ దర్శనం అమలు సాధ్యాసాధ్యాలపై అధికా రులు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. తిరుమల, యాదాద్రి ఆల యాల తరహాలో రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం లోనూ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు అవస రమైన చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల సూచించారు. ఈ మేరకు రాజన్న ఆలయ ఏఈవో బి.శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, నాగుల మహేష్, ఇంజనీరింగ్ అధికారి నాగ రాజు శనివారం యాదాద్రి వెళ్లి అక్కడ వీఐపీ బ్రేక్ దర్శనాల విధి విధానాలను ప రిశీలించారు. ఈ సందర్భంగా యాదాద్రి ఆలయ ప్రొటో కాల్ అధికారులు ఏఈవో రామ్మోహన్, పర్యవేక్షకుడు రాజన్ బాబు వీఐపీ బ్రేక్ దర్శనం కోసం తీసుకుంటున్న చర్యలు, అమలుతీరును వివరించారు. ఉదయం 9 నుంచి 10 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 1500 మంది చొప్పున రోజుకు మొత్తం మూడు వేల మందికి వీఐపీ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పిస్తున్నామని, వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ రుసుము కింద 300 రూపాయలు వసూలు చేస్తున్నట్లు వివరించారు.

కొండగట్టులో భక్తుల సందడి



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 17: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా భక్తులు వేకువ జాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

రవాణా శాఖలో అధికారుల బదిలీలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి17: తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖలో భారీగా బదిలీలను చేపట్టింది. డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ల(డీటీసీ) నుంచి రీజినల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్లు(ఆర్‌టివో), మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టరు (ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పె క్టర్ల(ఏఎంవీఐ)ల వరకు బదిలీ ఆయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బదిలీలు ఇలా ఉన్నాయి. ఈ బదిలీ ల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి డీటీసీగా ఉన్న మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వరంగల్ డీటీసీ పి పురుషోత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీగా బదిలీ ఆయ్యారు.

● కరీంనగర్ జిల్లా రవాణా కార్యాలయం నుంచి బదిలీఅయిన వారిలో ఆర్‌నాగలక్ష్మి(ఎంవీఐలు) కామారెడ్డికి, ఎం.శ్రీనివాస్(ఎంవీఐ)జగిత్యాల జిల్లా కోరుట్లకు, ఠాకుర్ ఈశ్వర్‌సింగ్(ఎంవీఐ) నిర్మల్‌కు, బి.రజినిదేవి (ఏఎంవీఐ), రాజన్న సిరిసిల్లకు బదిలీ ఆయ్యారు. కాగా టి రవికుమార్(ఎంవీఐ) ఆదిలాబాద్, కె.వేణు(ఎంవీఐ), హనుమకొండ, బి.శ్రీకాంత్ చక్రవర్తి(ఎంవీఐ) కుమరం ఆసిఫాబాద్, స్రవంతి(ఏఎంవీఐ), హనుమకొండ నుంచి కరీంనగర్ జిల్లాకు బదిలీపై వచ్చారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ కార్యలయం నుంచి వై కొండల్‌రావు (ఆర్‌టివో) హుస్నాబాద్‌కు, ఏ.కిషోర్ చంద్రరెడ్డి(ఎంవీఐ) మంచిర్యాల, టి విజయ్‌కుమార్(ఏఎంవీఐ)ఆదిలాబద్‌కు బదిలీ ఆయ్యారు. వి లక్ష్మణ్(ఎంవీఐ)సిద్దిపేట జిల్లా శోభాన్ బాబు(ఎంవీఐ) బోధన్ నుంచి రాజన్న సిరిసిల్లకు బదిలీ అయ్యారు.

● జగిత్యాల జిల్లా నుంచి సీహెచ్ రంజీత్ కుమార్ (ఎంవీఐ) మంచిర్యాలకు, వెంకటరమణ(ఎంవీఐ) కొత్తగూడెంకు, షేక్ ఖాసీమ్ సహెబ్(ఏఎంవీ) మంచి ర్యాలకు బదిలీ అయ్యారు. శ్రీనివాస్(ఎంవీఐ)కోరుట్ల, వెంకన్న (ఎంవీఐ)మహబుబాబాద్, సీహెచ్ రామా రావు(ఏఎంవీఐ)ఆదిలాబాద్ నుంచి జగిత్యాలకు బదిలీ అయ్యారు.

● పెద్దపల్లి జిల్లా నుంచి ఆఫ్రిన్ సిద్దిఖి(ఎంవీఐ) ఖమ్మంకు, సిరాజ్ ఉర్ రహ్మాన్ (ఏఎంవీఐ), ములుగు జిల్లాకు, అలే శ్రీనివాస్ అదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. ఉమార్ ఫారుఖ్(ఏఎంవీఐ) పాల్వాంచ చెక్ పోస్ట్ బద్రాది కొత్త గూడెంకు బదిలీ కాగా పి రంగారావు (ఎంవీఐ) వరంగల్ నుంచి శివ స్వప్న(ఎంవీఐ) నిర్మల్ నుంచి, బి శ్రీనివాస్(ఏఎంవీఐ) భూపాలపల్లి జయశంకర్ నుంచి పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 17: మండలంలోని నవాబుపేటలో మర్రి శ్రీనివాస్ అనే రైతు లేగదూడపై హైనా దాడి చేయడంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. శ్రీనివాస్ పశువులను బావి వద్దనే కట్టి వేస్తాడు. శనివారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెంది ఉందని రైతు తెలిపాడు.

సండే స్పెషల్

పెళ్లెప్పుడవుతుంది.. పిల్ల ఏడ దొరుకుతుంది

వధువుల కోసం యువకులు, తల్లిదండ్రుల వేట

● అన్ని రకాలుగా స్థిరపడ్డా కుదరని పెళ్లి సంబంధాలు

● గ్రామాల్లో, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి

● పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు

"'మా వోడు హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నడు.. నెలకు లక్షన్నర వరకు సంపాదిస్తున్నడు.. పిల్లనికి ఎటువంటి అలవాట్లు లేవు.. ఐదేండ్లయింది.. పిల్లను చూడవట్టి.. ఎంత చూసినా సంబంధం ఖాయం అయితలేదు.. పెండ్లి సంబంధాలు చూసేటోళ్లకు చెప్పినం.. చుట్టాలాళ్ల చెప్పి ఉంచినం.. చూస్తుండగనే 30 ఏండ్లు దాటినయి.. నెత్తిమీద ఎంట్రుకలు ఊడి పోతున్నయి.. ముందు కట్నం.. గిట్నం అని అన్నం.. తరువాత పెళ్లి చేసి ఇస్తే చాలన్నం.. ఇప్పుడయితే మేమే అన్ని ఖర్చులు పెట్టుకుంటం అంటున్నం.. అయినా పిల్ల దొరకుత లేదు.. వాని ఎక్కడ రాసి పెట్టి ఉందో'.. ఇదీ పెళ్లికాని యువకుల తల్లిదండ్రుల ఆవేదన. రోజురోజుకు పెళ్లికాని యువకుల సంఖ్య పెరిగిపోతోంది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా సంబంధాలు కుదరకపోవడంతో యువకులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు."

■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

గతంలో కన్యాశుల్కం ఇచ్చి వివాహాలు చేసుకునేవారు. తరువాత వరకట్నం మొదలైంది. సాంప్రదాయంగా ప్రారంభమైన ఈ పద్ధతి ఆడపిల్లల తల్లిదండ్రులకు భారంగా మారింది. ఇప్పుడు పరిస్థితి మారింది. రానురాను ఆడపిల్లల సంఖ్య తగ్గుతుండడంతో వధువులకు డిమాండ్ పెరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెయ్యి మంది పురుషులకు 942 మంది నిష్పత్తిలో మహిళలు ఉన్నారు.

● వధువుల కోసం ప్రయత్నాలు

జీవితాంతం ఆనందమయంగా గడపాలని అందరు కోరుకుంటారు. అదే క్రమంలో యువతులు చక్కని ఉద్యోగం చేసే భర్త కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే జీవితంలో స్థిరపడాలనే తపనతో ఈడుదాటి పోవడంతో యువకులు వధువుల కోసం వెతుకులాడే పరిస్థితి పెరిగి పోతుంది. ఎక్కడ చూసినా ఎక్కడైనా ఆడ పిల్ల ఉంటే చెప్పండి మా వాడు బెంగుళూర్, ముంబై, పుణే సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాడని తల్లిదండ్రులు అడుగుతున్న తీరు తరుచూ కనిపిస్తుంది. గతంలో ఉన్న పట్టింపులకు కూడా మరిచి రాశి, నక్షత్రం, గోత్రం మేం పట్టించుకోమని, అమ్మాయి బాగుంటే చాలని అడుగుతున్న వారు కూడా ఉన్నారు.

● మారుతున్న పరిస్థితులు


గతంలో 18 ఏళ్లలోపే ఏ పని చేసినా చేయకపోయినా పెద్దలు వివాహాలు జరిపించే వారు. ఇప్పుడు మారుతున్న కాలంలో ఉన్నత చదువులు, ఆర్థికంగా స్థిరపడిన తరువాతే వివాహం చేసుకోవాలని భావిస్తుండడంతోనే 40 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో చివరకు ఎవరైనా సరే అనుకున్నప్పటికి అమ్మాయిలు దొరకడం లేదు. యువకులతో పోల్చుకుంటే యువతుల సంఖ్య తక్కువగా ఉండడం కూడా మరో కారణం. రోజురోజుకు మ్యారేజ్ బ్యూరోలు పెరుగుతున్నాయి. మధ్యవర్తులు కమీషన్లు తీసుకుని పెళ్లిళ్లు కుదురుస్తున్నారు.

● ఇతర రాష్ట్రాలకు పరుగులు

గతంలో దగ్గరి సంబంధాలు కుదిర్చుకునే వారు. ఇప్పుడు అమ్మాయిల కోసం ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తున్నారు. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్నాటకలో సంబంధాలు వెదుకుతున్నారు.

● వ్యవసాయం చేసే వారికి ఇబ్బందులు


పెళ్లిళ్ల విషయంలో వ్యాపారాలు చేసే యువకులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత యువకులకు అమ్మాయిలు దొరకడం కష్టంగా మారింది. అబ్బాయి ఉన్నత చదువులు చదివి వ్యవసాయం చేస్తూ బాగా సంపాదిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఉండడానికి అమ్మాయిలు ఇష్టపడడం లేదు. గ్రామాల్లో ఉండే అమ్మాయిలు పట్టణాల్లో సాఫ్ట్‌వేర్, కనీసం ప్రైవేటు రంగాల్లో పనిచేసే వారిని ఇష్టపడుతున్నారు. గతంలో వరకట్నాలు అబ్బాయిలు అడిగిన వారే పెళ్లయితే చాలని అన్ని ఖర్చులు భరించి పెళ్లి చేసుకుంటున్నారు. మరికొన్ని కుటుంబాలు కులాలను కూడా పట్టించుకోవడం లేదు. అమ్మాయి బాగుండి చదువుకుంటే అగ్రకులానికి చెందిన యువకులు సైతం కులాలు చూడకుండా పెళ్లి చేసుకుంటున్నారు.



ఆర్థికంగా స్థిరపడ్డా అమ్మాయి దొరకడం లేదు

- కీర్తి విజయ్

ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు వివాహం చేసుకోవద్దని అనుకున్నాను. వ్యాపారంగా, ఆర్థికంగా స్థిరపడ్డాను. ఇప్పుడు అమ్మాయి దొరకడం లేదు. అమ్మాయిల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోవడమే కారణంగా అనుకుంటున్నాను.



భ్రూణ హత్యలు తగ్గాలి

- అంజయ్య, న్యాయవాది, జిల్లాల బాలల సంక్షేమ సమితి చైర్మన్

ఆడపిల్లలపై వివక్ష, అపోహలు తొలగించుకోవాలి. ఆధునిక యుగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. భ్రూణ హత్యల వల్ల ఆడమగ నిష్పత్తి దెబ్బతింటుంది. భ్రూణ హత్యలు తగ్గాలి. ప్రస్తుతం వెయ్యిమంది మగ పిల్లలకు 942 మంది అడపిల్లలు ఉన్నారు. ఇలాగే కొనసాగితే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతాయి.



సమస్యలకు పరిష్కారం చూపేదే సైన్స్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17: సమస్యలకు పరిష్కారం చూపించేది సైన్స్‌మాత్రమేనని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని ప్రేమలత అన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం విద్యార్థులకు సైన్స్‌టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. మండలంలోని ఆదర్శపాఠశాలకు చెందిన పర్ణిక, గాలిపెల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన శ్రీవాణి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సైన్స్ కోఆర్డినేటర్లు మహేష్‌చంద్ర, యాద రవి, రామేశ్వర్‌రెడ్డి, సీఆర్పీ నర్సయ్య పాల్గొన్నారు.

నల్లకుంటలో చేపలు పట్టుకునే అధికారం కల్పించాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17: మండలంలోని నల్లకుంట చెరువులో చేపలు పట్టే అధికారం గాలిపెల్లి మత్స్యకారులకు కల్పించాలని శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా గాలిపెల్లి మత్స్యశాఖ కమిటీ చైర్మన్ ఎంఢ్ర చందన్ మాట్లాడుతూ నల్లకుంటలో గాలిపెల్లికి 85శాతం, జవారిపేటకు 15శాతం వాటా ఉందని గతంలో అధికారులు నిర్ధారించారని తెలిపారు. కార్యదర్శి జిర్ర అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు చక్రాల తిరుపతి, సంఘ నాయకులు ఎంఢ్ర రమేష్, పిల్లి లక్ష్మణ్, దురుముట్ల రమేష్, మంత్రి రాజమల్లు, కుంబం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి గీతామందిరం భక్తుల పాదయాత్ర

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని గీతా మందిరం కమిటీ కార్యదర్శి, పురోహితులు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలోని భక్తులు శనివారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్రను చేపట్టారు. గొల్లపల్లి గ్రామంలో యాత్రను ప్రారంభించారు. ప్రతి యేటా గీతా మందిరం వార్షికోత్సవాల అనంతరం రాజన్న ఆలయానికి పాదయాత్ర చేపడుతున్నామన్నారు.

బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చారిత్రాత్మకం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీసీ భవన్‌లో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టడం సామాజిక న్యాయంతో పాటు విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాల్లో బీసీ జనాభా ప్రాతిపదికన వాటా దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు తడక కమాలాకర్, కందుకూరి రామాగౌడ్, దేశపాండే అంజనేయులు, కంచర్ల రవిగౌడ్, బట్టు ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీగాధ గణేష్, ఎలుక రాజు, మామిండ్ల భూపతి, గజ్జెల రాజు, ఇల్లంతకుంట తిరుపతి, చొక్కి కైలాస్, గంగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రంగి: బీసీ కులగణన తీర్మానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయమని బీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, తర్రె మనోహర్, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, దర్న మల్లేశం, తర్రె లింగం, పడాల శ్రీనివాస్, దువ్వాక గంగాధర్, ఇప్ప నరేష్, శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పని చేస్తేనే గుర్తింపు

చందుర్తి, ఫిబ్రవరి 17: సేవాభావంతో పని చేస్తేనే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయుడు వేణుగోపాల్ బదిలీపై వెళ్లగా శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చేసిన సేవలను విద్యార్థులు మర్చిపోరన్నారు. ప్రధానోపాధ్యాయులు శంకర్, విక్కుర్తి లక్ష్మీనారాయణ, నాయకులు సిరికొండ శ్రీనివాస్, గొట్టె ప్రభాకర్, చిర్రం తిరుపతి, రవిందర్‌రెడ్డి, చంద్రం, పాల్గొన్నారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ ప్రోగ్రాం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 17: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఇంపాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాటజిస్ట్ అనిత, ఇంపాక్ట్ ప్రోగ్రాం డైరెక్టర్లు సాయిబాబు, సుధాకర్ ఆవుల, తిరుపతి, ఇంపాక్ట్ ట్రైనర్లు రమాదేవి, పోచవ్వ, మదనమొహనాచారి, బాలకిషన్, సురేష్ అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో ఎలా ముందుకెళ్లాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 17: తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. గ్రామానికి చెందిన సులోచనకు పురిటి నొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 108వాహనంతో సిబ్బంది సులోచనను సిరిసిల్ల ఆసుపత్రికి తరలించే క్రమంలో పురుటి నొప్పులు పెరిగాయి. దీంతో దారి మధ్యలోని సిబ్బంది ఈఎంటి శ్రీకాంత్, పాయిలేట్ మనోజ్ పురుడు పోయడంతో పండంటి మగపిల్లాడికి జన్మించాడు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

సిరిసిల్లలో నేడు ఉపాధిహామీ కార్మికుల జిల్లాస్థాయి సదస్సు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : ఉపాధిహామీ కార్మికుల జిల్లా స్థాయి సదస్సు ఆదివారం సిరిసిల్లలో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌లోని కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే అదిశ్రీనివాస్‌తోపాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్ హాజరుకానున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమనాగరాజు, జిల్లా నాయకులు కిషోర్ పాల్గొన్నారు.

సైన్స్ టెస్ట్‌లో విద్యార్థులు రాణించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : సైన్స్ టెస్ట్‌ల్లో విద్యార్థులు రాణించాలని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య అన్నారు. సిరిసిల్లలో శనివారం బయో, ఫిజికల్ సైన్స్ రాష్ట్ర ఫోరం మండల స్థాయిలో 8,9 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అరుకాల కావ్య, ఎక్కల్‌దేవి అక్షర మొదటి స్థానంలో నిలవడంతో జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ అభినందించారు. ఉపాధ్యాయులు ద్యావనపల్లి పరమేష్, కోడం భారతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీటూపీజీ ప్రాంగణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మండలంలోని 11 పాఠశాలకు చెందిన 8,9వ తరగతిలకు చెందిన విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో లింగన్నపేట పాఠశాలలోని 8వ తరగతి చెందిన ప్రణవి, 9వ తరగతి చెందిన అభిజ్ఞలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు జిల్లా స్థాయిలో జరగబోయే టాలెంట్ టెస్ట్‌లో పాల్గొననున్నారు. హెచ్‌ఎంలు పద్మాదేవి, వెంకటరామారావు, సీఎచ్ రామారావులు తదితరులు ఉన్నారు.

హేమంత్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : తల్లి దండ్రుల కష్టాలను తప్పించడానికి వస్త్రాల ఫోల్డింగ్ యంత్రాన్ని జక్కని హేమంత్ తయారు చేసి రాష్ట్ర స్థాయికిఎంపికవడం హర్షనీయమని శివనగర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమరామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా శనివారం సర్వసతి విగ్రహానికి పూజలను నిర్వహించారు. అనంతరం హేమంత్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, శ్రీహరి, సరిత, రజిత, అజయ్, మాల్లారపు పురుషోత్తం, నారాయణ, సాంబయ్య, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కొండూరు రవీందర్‌రావు, తోట ఆగయ్య

సిరిసిల్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు మొక్కలు నాటారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అకునూరి శంకరయ్య, నాయకులు బైరి ప్రభాకర్, వెంగళ శ్రీనివాస్, మల్లారెడ్డి, భాస్కర్, పూర్ణచందర్, ఇజ్జగిరి, తుమ్మ రాజు, చేరాల స్వాతి, అగ్గిరాములు పాల్గొన్నారు.

● సిరిసిల్ల మున్సిపల్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాశ్మీర్ పర్యటనలో ఉండగా చందన్‌వాడీ వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలతో జన్మదినం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్యయాదవ్, పర్శరాం, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొప్పాపూర్ ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి ఆధ్వర్యంలో మహిళలు వేములవాడలోని రాజన్న ఆలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ పడిగెల మానస రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, ప్యాక్స్ చైర్మన్లు కొడూరి భాస్కర్‌గౌడ్, బండి దేవదాస్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో మాజీ కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ వంగ కరుణ, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హైమద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దయాకర్‌రావు ఉన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీపీ మాలోతు భూల, పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, మండల కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుగులోతు కళ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ తల్లి కూడలిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు పాల్గొన్నారు.

వేములవాడ : వేములవాడలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు తొలుత రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,



కాశ్మీర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న మున్సిపల్ కౌన్సిల్



వేములవాడలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పొలాస నరేందర్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, శ్రీనివాసరావు, నరాల శేఖర్, నాయకులు రామతీర్థపు రాజు, కనకయ్య, నర్సయ్య, సలీం, క్రాంతి కుమార్, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలంలోని అగ్రహారం జోడాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ముందు భాగంలో కేక్‌కట్ చేశారు. జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ ఆర్సీరావు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చందుర్తి : బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, ఎంపీపీ బైరగొని లావణ్య, సెస్ డైరెక్టర్ పోన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్లు తిప్పని శ్రీనివాస్,జలగం కిషన్‌రావు, కేక్ కట్ చేసి స్వీట్లను,పండ్లు పంపిణీ చేశారు.మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి పాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, మండల అధ్యక్షుడు దేవయ్య, ఆరే మహేందర్, గోపు పరశురాములు, పోకల సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి : మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వాలీబాల్ క్రీడా కారులకు ఎంపీపీ స్వరూపరాణి మహేష్ క్రీడాదుస్తులను అందజే శారు. జడ్పీటీసీ మీనయ్య, సెస్ డైరెక్టర్ గంగారాం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, వైస్ ఎంపీపీ చిన్నభూమయ్య, ఎంపీటీసీ లావణ్యరాజేశం పాల్గొన్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయం



ప్రారంభిస్తున్న జడ్పీటీసీ మంజుల, కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 17: సిరిసిల్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ. 13లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని, మిగిలిపోయిన పనులు పూర్తి చేస్తామని అన్నారు. నిధుల కోసం మంత్రులకు విన్నవించినట్లు చెప్పారు. త్వరలో నిధులు మంజూరవుతాయని వెల్లడించారు. బస్వాపూర్‌లో రూ.5లక్షలతో ప్రహరీ నిర్మాణానికి, జిల్లెల్లలో యాదవ సంఘం కోసం రూ. 2లక్షలు, బోరుమోటార్, ఒబులాపూర్ గ్రామం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద రూ.2లక్షలతో బోరుమోటార్, ఇందిరమ్మకాలనీలో రూ.2లక్షలతో బోరుమోటార్, మండెపల్లి పెద్దమ్మ దేవాలయం వద్ద రూ.2లక్షలతో బోరుమోటార్ ఏర్పాటు చేశారు. అంకుసాపూర్ గ్రామంలోని చౌదలమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమల్లో కాంగ్రెస్ నాయకులు కణమేని చక్రధర్‌రెడ్డి, వైద్య శివప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు ఆసారి బాలరాజ్, లింగాల భూపతి, సుద్దాల శ్రీనివాస్, గుగ్గిల్ల శ్రీకాంత్‌గౌడ్, మునిగెల రాజు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి మండలం చేరుకున్న గోదావరి జలాలు

చందుర్తి, ఫిబ్రవరి 17 : చందుర్తి మండలానికి శ్రీపాద ఎల్లంపల్లి కాల్వ ద్వారా గోదారి జలాలు శనివారం చేరుకున్నాయి. గోదావరి జలాలు రావడంతో రామన్నపేట గ్రామంలోని శ్రీపాద ఎల్లంపల్లి కాల్వ కాంగ్రెస్ నాయకుడు భీమరాజ్ కనకరాజు ఆధ్వర్యంలో నాయకులు, రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదారి జలాలు రావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ చందుర్తి మండలానికి గోదావరి జలాలు రావడానికి కృషి చేసిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సహకరిస్తున్న రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు చింతం ముత్తయ్య, తిప్పని శంకర్, శంకర్, ముదిగంపల్లి కిషన్, గంగయ్య, దేవయ్య, ఆనందం, రాజయ్య, భూమయ్య, మల్లయ్య శ్రీనివాస్, బాలు, బొడ్డు బాబు, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

శ్మశాన వాటిక స్థలం చదును.. అడ్డుకున్న గ్రామస్థులు



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17 : భూపతినగర్ శ్మశాన వాటికను సిరిసిల్లకు చెందిన వారు కబ్జాకు యత్నించగా శనివారం గ్రామస్థులు అడ్డుకొని ఆందోళనకు దిగారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోని భూపతినగర్‌ను ఆనుకొని ఉన్న భవానికుంట శిఖంలో 60 ఏళ్లుగా శ్మశాన వాటికను నిర్వహిస్తున్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి ఆ స్థలం తనదేనని శనివారం భూమిని చదును చేస్తుండగా వార్డు కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్‌తోపాటు గ్రామస్థులు అడ్డుకున్నారు. 60 ఏళ్లుగా ఆ భూమిని శ్మశానికి వాడుకుంటున్నామని, స్థలం కబ్జాకు గురికాకుండా అధికారులు కాపాడాలంటూ అందోళనలు చేయడంతోపాటు బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అంజయ్య, నరహరి, కుమార్, దేవదాస్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు 5కే రన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17:జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు మార్చి 3న సిరిసిల్లలో 5కే రన్ నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో యాంటీ డ్రగ్స్ అవగాహన 5కె రన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5కె రన్‌లో ఆసక్తి గల యువతీ, యువకులు, విద్యార్థులు, ఉద్యోగస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం జిల్లా పోలీసు కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. యువత మంచి భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రైస్‌మిల్లును తరలించాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 17: తంగళ్లపల్లి మండల కేంద్రంలో మహాలక్ష్మి రైస్‌మిల్లును జనవాసాల మధ్య నుంచి తరలించాలని వడ్డెర కాలనీ వాసులు తహసీల్దార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. రైస్‌మిల్లు నుంచి వస్తున్న డస్ట్‌తో అనారోగ్యం బారిన పడుతున్నామని, శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రైస్‌మిల్లు చుట్టూ సుమారు 150వరకు గృహాలు ఉన్నాయని తెలిపారు. రైస్‌మిల్లును మరోచోటకు తరలించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, గజభీంకర్ సంతోష్, మొహన్, పాపయ్య, ఆంజీ తదితరులు ఉన్నారు.

కారు అందజేత

గంభీరావుపేట, ఫిబ్రవరి 17 : గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మేడ రాజశేఖర్‌కు స్థానిక సహకార బ్యాంక్ ద్వారా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం కారును అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద సహకార బ్యాంక్ సహకారంతో షిఫ్ట్ డీజర్ కారు మంజూరైంది. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్, సీఈవో రాజిరెడ్డి, సొసైటీ మేనేజర్ పురం సత్యంరావు, సిబ్బంది విష్ణు, నాగరాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన నేతలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 17: గంభీరావుపేటకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు శనివారం వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కామారెడ్డి హన్మండ్లు, యెల్ల బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 17: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ నాయకుడు సత్తు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న మండెపల్లి ఎంసీసీ క్రికెట్ జట్టుకు టిషర్ట్ అందజేశారు. ప్రతిభ కనబర్చిన ఏఆర్ పోలీస్ జట్టుకు చెందిన కార్తీక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేశారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, నరేశ్, పర్శరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి శ్రీధర్‌గౌడ్ (42) అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. మోకుజారడంతో కిందపడ్డాడు. దీంతో గాయాలు అయ్యాయి. గాయపడిన శ్రీధర్‌గౌడ్‌ను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

శాంతినగర్‌లో చోరీ

సిరిసిల్లా క్రైం ఫిబ్రవరి 17: సిరిసిల్ల పట్టణంలోని శాంతి నగర్‌లో అద్దెగట్ల అరవింద్ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శాంతి నగర్‌కు చెందిన అద్దెగట్ల అరవింద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 13న ఇంటికి తాళం వేసి తీర్థ యాత్రలకు వెళ్లారు. దొంగలు ఇంటి తాళం పగుల గొట్టి లోనికి చొరబడి బీరువాను ధ్వంసం చేశారు. అందులోని రూ.40 వేల నగదు, పది గ్రాముల బంగారం చైన్ రెండు జతల బంగారు కమ్మలు, ఏడు గ్రాములు రింగులు, పదిహేను తులాల వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉండగా సిరిసిల్ల పట్టణంలోని ఓ కౌన్సిలర్ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆ కౌన్సిలర్ కుటుంబ సభ్యులతో తీర్థయాత్రలకు వెళ్లడంతో వచ్చిన తరువాత ఏం జరిగిందనేది తెలయాల్సి ఉంది. ఈ రెండు ఘటనలకు సంబంధించి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీల ఆధారంగా పూర్తి వివరాలు తెలసుకున్నట్లు, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17: భూ వ్యవహారంలో చీటింగ్ చేయడమే కాకుండా చంపుతానని బెదిరించిన సిరిసిల్ల పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి సురేశ్‌కు సర్వే నంబరు 112, 129లో రెండు ప్లాట్స్ కలిపి 320గజాల భూమిని రమేశ్ ఫిబ్రవరి 5, 2015న రిజిస్ట్రేషన్ చేశాడు. ఆ భూమిని మళ్లీ తప్పుడు కాగితాలతో సంతకాలు ఫోర్జరీ చేసి అందులో నుంచి 150గజాల భూమిని తంగళ్లపల్లికి చెందిన తక్కళ్ల అశోక్‌కు మే 24, 2019న రమేశ్ రిజిస్ట్రేషన్ చేశాడు. తనకు అమ్మిన స్థలంలో నుంచి అశోక్‌కు ఎందుకు చేశావని అడిగితే చంపుతానని బెదిరించాడని సురేశ్ ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు ఉంటే స్వయంగా వచ్చి ఫిర్యాద ుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17: అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుకతో కలిసి శనివారం ప్రారంభించారు. వెంకటాపూర్‌లో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. బండలింగంపల్లిలో సుమారు 200 మంది రైతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పల్లె ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి పాటు పడుతోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలుతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. బండలింగంపల్లిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు అత్యధిక ఓట్లు వేసిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కోరుట్లపేట గ్రామానికి చెందిన బర్కోటి ఎల్లవ్వ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమె భర్త ఎల్లయ్యకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రధర్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, దేవానందం, రవి, పద్మారెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, మల్లారెడ్డి, దేవయ్య బాలయ్య, అంజిరెడ్డి, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలచందర్, ఎల్లాగౌడ్, ఇమాం, హైమద్, ప్రశాంత్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తరిగిపోతున్న సహజ వనరులు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 17: సంప్రదాయ వనరులైన బొగ్గు, నూనె వంటి సహజవాయువు నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయని, సంప్రదాయేతర సౌరవిద్యుత్ మాత్రమే భవిష్యత్ తరాలకు విద్యుత్ అవసరాలను తీర్చగలుగుతుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఎలక్ట్రికల్, మెకానికల్ డిప్లొమా చివరి సంవత్సరం విద్యార్థులకు గ్రీన్ వియాన్ ఎనర్జీ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో సౌర ఫలకాల రూపకల్పనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంప్రదాయేతర విద్యుత్ వినియోగంలో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా నాలుగో స్థానంలో ఉందన్నారు. గత పదేళ్లలో సౌర విద్యుత్ సామర్థ్యం ముప్పై రేట్లు పెరిగి 70 జిగావాట్స్‌కు చేరుకుందన్నారు. సౌరవిద్యుత్‌తో వాతావరణం కాలుష్యం తగ్గుతుందన్నారు. సౌరశక్తి రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గ్రీన్ వియాన్ ఎనర్జీ టెక్నాలజీస్ మేనేజర్ పురుషోత్తం సౌర ఫలకాల తయారు చేసేందుకు వాడే ముడి పదార్థాలు, వాటిని తయారు చేసే విధానం, వాటిని ఏర్పాటు చేసే స్థలాన్ని బట్టి ఏ కోణంలో, ఏ దిశలో అమార్చాలనే అంశాలపై వివరించారు. అధ్యాపకులు శ్రీదేవి, తారాకృష్ణమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



పాల్గొన్న జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17: సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల అభ్యున్నతికి పరితపించారని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మండల గిరిజన సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రదర్శన తీశారు. భోగ్ బండార్ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు ప్రతి గిరిజనుడికి అందినప్పుడే సేవాలాల్ మహరాజ్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించారన్నారు. ఎంపీపీ రేణుక, వీర్నపల్లి జడ్పీటీసీ కళావతి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ అనసూయ, బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్, నాయకులు రాజునాయక్, సీత్యానాయక్, సూర్యనాయక్, కిరణ్ నాయక్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సేవలల్ మహరాజ్ జయంతిని శనివారం నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతికి పెద్ద ఎత్తున గిరిజనులు తరలివచ్చారు. జిల్లా అధ్యక్షుడు భానుతు నరేష్ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, ప్రతీ మండలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, రమేష్ నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.